# నమ్మిన బంటు

[ కథానిక ]

● శ్రీ 'కరుణకుమార' ●

౧

" *Appointed magisterial munshi. Start immediately — Giri.* "

అని ఎదుటింటి సుబ్బారావు టెలిగ్రాం చదివి వినిపించాడు.

"ఎక్కడనుంచి నాయనా! అందరూ బాగున్నారా ?" అని గడగడ వొణికిపోతూ అడిగాడు సోమప్ప.

"మీ అబ్బాయే యిచ్చాడు. అందరూ బాగానే ఉన్నారుట" అని టెలిగ్రాం మళ్లా చదివి వినిపించాడు సుబ్బారావు.

"అంటే ఏమిటి నాయనా?" అని కాస్త తమాయించుకొంటూ అడిగాడు సోమప్ప.

సుబ్బారావు—మీ అబ్బాయి ఇప్పుడు మేస్ట్రీటుకచ్చేరిలో గదాండీ ఉన్నాడు?

సోమప్ప — ఆ! అవునవును. వాడికి మేస్ట్రీటు ఉద్యోగం అయిందా ఏమిటి? అవుతుందని ఆ మధ్య అనుకొంటున్నాగులే.

సుబ్బా—మేస్ట్రీటుగా కాదు. మేస్ట్రీటు మున్షీగా వేశారుట.

సోమప్పకి ఆనందబాష్పాలు గిర్రున తిరిగినై కళ్లల్లో.

"మేస్ట్రీటుకీ, మేస్ట్రీటుమున్షీకీ ఆట్టే తేడా లేదులెండి."

సంతోషం పట్టలేక ఈశుభవర్తమానం భార్యతో చెప్పాలన్న తొందరలో 'ఏమేవు' అని వెర్రికేక పెట్టాడు సోమప్ప.

ఈయనగారి కేక వినిపించకపూర్వమే వీథిలో మాటలు విని ఏమిటో తెలుసుకొందామని అప్పటికప్పుడే వంటిల్లు విడిచి బయల్దేరింది భార్య.

సోమప్ప — అబ్బాయి టెలిగ్రాపు కొట్టాడు.

భార్య— అమ్మయ్యో! టెలిగ్రాపే! అందరూ బాగున్నారని కొట్టేడా ?

అని గుండెమీద చెయ్యి వేసుకొంది.

సోమప్ప —ఆ! అందరూ బాగున్నారుట. పిల్లవాళ్లు ఆడుకొంటున్నారుట. పెద్ద పిల్లవాడు బడికి పోతున్నాడట. చంటిది తెగ అల్లరి చేస్తోందిట. అబ్బాయికి ప్రమోషన్ అయిందట.

భార్య—ప్రమోషనంటే ?

సోమప్ప— పెద్ద ఉద్యోగం అయిందట. మేస్ట్రీటుగా వేశారుట.

భార్య—మేస్ట్రీటుగానే ?

సోమప్ప— వెంటనే నిలుచున్నపాటుగా బయల్దేరి రమ్మని కొట్టాడు.

భార్య—ఎవర్ని ?

సోమప్ప—నిన్నూ నన్నూను.

భార్య—నే చచ్చిపోనూ! నన్నుగూడా రమ్మన్నాడుటండీ ?

సోమప్ప—ఇద్దర్నీ రమ్మని కొట్టాడు. వంట త్వరగా కానియ్యి. పన్నెండుగంటల మోటారు కందుకోవాలి.

భార్య — ఇదిగో, వం టెంతసేపు? మీరు స్నానంచేసి మడిగట్టుకోండి.

అని కాళ్లు తడబడుతూ లోపలికి వెళ్లి పోయింది.

సుబ్బా—సోమయ్యగారూ! మేస్త్రీటు ఉద్యోగానికి అవేవో పరీక్షలు పేసుకావాలి కాబోలునే, మీ అబ్బాయి అవన్నీ అయి నాడా ?

సోమప్ప—ఆహా! అన్నీ అయినాడు. వాడు పేసుకాని పరీక్ష లేనేలేదు. నాకు తెలుసు. ఒకవేళ పేసుకాకపోయినా వాణ్ణి కళ్లనద్దుకొని మరీ యిస్తారు ఉద్యోగాలు.

సుబ్బా — ఇంగ్లీషులో మేస్ట్రీటు మున్షీ అని ఉందేమిటండీ? అచ్చం మేస్ట్రీటు అని ఉండవలసింది!

సోమప్ప—అదేదో పోస్టువాళ్ల పొర పాటు నాయనా! మావాడు మేస్త్రీటనే ఇచ్చి ఉంటాడు. వీళ్లు కొట్టడంలో తప్పు కొట్టి ఉంటారు. అంతే.

సుబ్బా—అసలా కచ్చేరిలో మేస్ట్రీటు మున్షీ అని ఒకడుంటాడా ?

ఏమి టీ కుంటిప్రశ్నలు! అసహ్యా మవుతోంది సోమప్పకి.

సోమప్ప—మున్షీ అని ఒకడు ఉంటాడే అనుకో. ఉన్నా మేస్ట్రీటుకీ, మున్షీకీ తేడా లేనేలేదయ్యా! మేస్ట్రీటే మున్షీ; మున్షీయే మేస్ట్రీటు! నాకు తెలుసు. ఆమాట కొస్తే మేస్ట్రీటుకంటెకూడా మున్షీకే ఎక్కువ అధికారం, గౌరవమూను. విన్నావా ?

"అయితే అబ్బాయికి జీతం ఎంత ఇస్తా రండీ" అని లోపలినుండి పనిగట్టుకొని వచ్చి అడిగింది భార్య.

సోమప్ప—ఇదివరకు ఉండిన మేస్ట్రీటు పాతవాడు, సార్వీసుగలవాడూను. ఆయనకి రెండువంద లిచ్చేవా రని అనేవారు. మన వాడు కొత్తగా చేరాడుకాబట్టి, అందులో సగానికి సగమయినా ఉంటుం దనుకొంటాను.

"ఏమోలెండి. పాడుజీతం! వెధవడబ్బు! డబ్బుని మనం గడించామా, మనల్ని డబ్బు గడించిందా? నారాయణమూర్తిచలవన పిల్లవాడు బాగుండి పైకి రావాలి గాని జీతాల కేమి లెండి?" అంటూ లోపలికి పోయింది భార్య.

"వస్తానండీ" అంటూ లేచాడు సుబ్బా రావు.

"అబ్బాయ్, ఇప్పుడు నేను రాలేను గాని, మీనాన్నగారితో ఇట్లా ఇట్లా మా గిరికి మేస్త్రీటు అయిందని చెప్పు నాయనా, సంతోషిస్తాడు." అని చెప్పి "రామనామ తారకం, భక్తిముక్తిదాయకం" అంటూ స్నానానికి లేచాడు సోమప్ప.

౨

సోమప్ప వెలనాటివైదీకి. శేషగిరి అతని కొక్కడే కొడుకు. చిరకాలం లేకలేక కలిగిన సంతానమేమో, ఆ కసుగాయని కంటికి రెప్పలా కాచి పెంచుకొన్నా రాతల్లీ, తండ్రీని.

సోమప్ప అంతగా విద్యాగంధం అలవరుచుకొన్నవాడు కాడు. పల్లెటూళ్లో వీధిబడి అయ్యగారిదగ్గర చదువుకొన్న పెద్ద బాలశిక్షా, బాలరామాయణం, నరసింహ శతకం—ఇట్లాంటివి ఏం చదువుకొన్నాడో అంతే. తర్వాత జులాయిరకంగా తిరిగి చదువుకు స్వస్తిచెప్పినందువల్ల ఏళ్లు పైబడి శరీరం ముదురుతేలేవరకు వొంటబట్టిన ఆ కాస్త అక్షరమ్ముక్కా అతని బాల్యంతోపాటు హరించి చక్కాపోయింది. ఇక భార్య కాపరానికి వచ్చి, బరువు నెత్తికెక్కేసరికి, ఏశూద్రుయిళ్లల్లోనో ఇంత పౌరోహిత్యం చేసుకొంటూ కాలం గడుపుకొంటూ ఉండేవాడు.

తన జీవితంలో ఎన్ని లోపా లున్నా తన బిడ్డలుమాత్రం అఖండప్రయోజకులయి వృద్ధిలోకి రావా లని ప్రతితండ్రీ కోరుకొంటూ ఉండడం సహజమే. అందులో, లేకలేక అబ్బరంగా పుట్టిన బిడ్డడయితే ఆ తల్లిదండ్రుల ఆశయాలన్నీ ఒక్క స్థానంలోనే కేంద్రీకరించి కరడుకట్టిపోతాయి.

క్రిందిక్లాసుల్లో ఎన్ని బోల్తాలు కొట్టినా, చివరకి ఇస్కూలుఫయినల్ అనిపించాడు ఆకొడుకు. పేసయినాడంటే అయినా డన్నారు అందరూను. పై కాలేజీచదువుకు పనికి రాకపోయినా, అతని స్కూలుఫయినల్ విజయం సర్కారుఉద్యోగసాధనానికి చాలంటే చా లనుకొని సంతోషపడ్డారు.

ఆ రోజుల్లో — ఆ రోజుల్లోనేగాదు, ఈరోజుల్లోగూడా — ఇంగ్లీషు చదువుకొని ఉద్యోగాలకొరకు ఊరేగే లేతహృదయాలను రివిన్యూ డిపార్టుమెంటూ, ఇర్రిగేషన్ డిపార్టుమెంటూ, రిజిస్ట్రేషన్‌డిపార్టుమెంటూ ఉవ్విళ్లూరించినట్లు ఇతర డిపార్టుమెంటు లేవీ ఊరించేవికావు. ఇతర డిపార్టుమెంట్లలో ఉద్యోగం ఉద్యోగం కాదు. అది కేవలం నౌకరీ ప్రాయం.

అటువంటిరోజుల్లో శేషగిరికి తాలూకా కచ్చేరీలో గుమాస్తాఉద్యోగం అయిందంటే, ఎంతటిపూర్వజన్మసుకృతఫలం అనుకోవాలి! ఎంత అదృష్టం అనుకోవాలి! ఆతండ్రి జాతకాలు రాయించాడు. కేరళప్రశ్నలు పలికించాడు. హస్తసాముద్రికాలు పరిశీలనచేయించాడు. ఓ! అఖండజాతకం శేషగిరిది. దశ అందుకోవాలిగాని, అందుకొంటే కనకవర్షం కురిపిస్తాడు. పట్టిం దల్లా బంగారమే. పైగా సాముద్రికరీత్యా అతని హస్తంలో ముద్రణాధికారంగూడా ఉందని అంటున్నారు వైజ్ఞానికులు !

ఆ తల్లిదండ్రుల ఆనందవారాశి చెలియలికట్టనికూడా మరచిపోతోంది. కాని "అబ్బాయి ఉద్యోగంలో చేరి పదిసంవత్సరాలయినా ఇంకా రివిన్యూఇన్‌స్పెక్టరేనా కాలేదు ఎందువల్ల ? ఇట్లా చూసిన గుమాస్తాలు అట్లా రివిన్యూఇన్‌స్పెక్టరయి మిద్దెలు కట్టిస్తున్నారు, మాన్యాలు కొంటున్నారు, భార్యల ఒంటినిండా బంగారం దిగేస్తున్నారు! మన అబ్బాయికి ఇంకా జీతం ఏభయిరూపాయలేనా కాలేదు, ఎందువల్లనబ్బా ?" అని తల్లిదండ్రులు ఊ విచారిస్తూ ఉండేవారు.

సర్కారువారికి బ్రహ్మద్వేషం పుట్టి తనని పైకి రానివ్వకుండా చేస్తున్నారని చెప్పి ఆ తల్లిదండ్రుల నోదారుస్తూ ఉండేవాడు శేషగిరి.

"అయ్యో! వీళ్ల కడుపు కాల! అన్న ద్వేషమూ, బ్రహ్మద్వేషమూ పుట్టితే వాళ్లింక వృద్ధిలోకి వస్తారా" అని శాపనార్థాలు పాడేవారు తల్లిదండ్రులు.

అట్లాంటిది, నాటికి నేడు, అబ్బాయి మేస్ట్రీటుమున్షీ అయిపోతే, దళ అందుకోవడం గాక మరేమిటి ?

సోమప్ప—అబ్బాయీ! మేస్ట్రీటుమున్షీ అని పెలిగ్రాపు కొట్టేవు. మున్షీ అంటే ఏమిటిరా?

శేషగిరి—మున్షీ అంటే మేస్ట్రీటుదగ్గర ఉండే గుమాస్తా అన్నమాట.

సోమప్ప—గుమాస్తాయేనా? అంతేనా!

శేష—అవును.

సోమప్ప—ఇదివరకుకూడా నీవు మేస్ట్రీటు కచ్చేరీలోనే గదా గుమాస్తాగా ఉన్నావు. ఇప్పుడు వచ్చిన అదన మేమిటి ?

శేష—ఇదివరకు పదిమందిలో నేనొక గుమాస్తాను. ఏదో ఆఫీసులో గుమాస్తాలు వ్రాసిన కాగితాలు లెఖ్కవ్రాసి కవర్లు కట్టి పోస్టుకు పంపించే పని చేసేవాణ్ణి.

సోమప్ప—ఇప్పుడో ?

శేష—మేస్ట్రీటుగారిదగ్గర ఎల్లప్పుడూ ఖుద్దున ఉండే మున్షీ ఉద్యోగం.

సోమప్ప—ఆయనదగ్గర ఎల్లప్పుడూ ఉండడానికి జవాన్లు ఉన్నారుగా? నువ్వు వుండడం ఎందుకు ?

శేష—సరే! మనం లేనిదీ ఆయనకు కలం జరగనే జరగదు.

సోమప్ప—అట్లాగా ?

శేష—మేస్ట్రీటుగారు కేసు విచారించినంతసేపూ మనం దగ్గరనే ఉండాలి. ఆయన వ్రాసిన సాక్షుల వాఙ్మూలాలన్నీ మనం సాక్షులకు చదివి వినిపించాలి.

సోమప్ప—ఎందుకూ?

శేష—ఆయనవ్రాతల్లో తప్పులు కనిపెట్టడానికి.

సోమప్ప—అబ్బా!

శేష—నేరంచేసినవాళ్లని పోలీసులు అరెస్టుచేసి తీసుకొనివస్తే, వాళ్లని కొట్టులో పెట్టేఅందుకు ఉత్తర్వులు మనం వ్రాసి యిస్తేనేగాని మేస్ట్రీటుగారు సంతకం పెట్టడానికి వీలేలేదు.

సోమప్ప—ఆ!

శేష—నేరంచేసినవాళ్లకి జుల్మానా విధించే డ్యూటీ మేస్ట్రీటుగారిదయితే, ఆ మొత్తాలు వాళ్లదగ్గరనుంచి తీసుకొని, లెఖ్కచూచి, ఖజానాలో జమకట్టే డ్యూటీ మనది.

సోమప్ప—డబ్బుతో పని మరి. ఎంత జవాబ్దారీ ?

శేష—మున్షీ అంటే మేస్ట్రీటుకు ఎంత నమ్మకం ఉండాలి? ఆయనకి నమ్మినబంటూ, గుండెకాయలాగా ఉండాలి. అందుకనే పదిమందిగుమాస్తా లుంటే ఏరిఏరి నన్నే వేసుకొన్నాడు మున్షీగా.

సోమప్ప—చేతగానివాళ్లని వేసుకొంటే ఆయనకే మాట వస్తుంది మరి!

శేష—ఎక్కడెక్కడజరిగిన చోరీనేరాలయినా, చోరీసొత్తు బంగారేమిటి, వెండేమిటి, ధాన్యమేమిటి, గుడ్డలేమిటి—సమస్తమూ తీసుకొనివచ్చి మనదగ్గర దాఖలుచేస్తూ ఉంటారు పోలీసులు.

సోమప్ప—వాటికంతా నువ్వు లెఖ్ఖలు వ్రాసిపెట్టాలా ఏమిటి ?

శేష—ఒకలెఖ్ఖలేనా? కేసు తీర్మానం అయ్యేవరకూ ఆ సొత్తులన్నీ మన స్వాధీనం లోనే ఉంటాయి. ఆ పెట్టెల బీగాలన్నీ మన వద్దనే ఇస్తూఉంటారు మేస్ట్రీటుగారు.

తల్లి — అబ్బాయీ! సర్కారువాళ్లు నీ మీద ఇంత జవాబ్దారీ పెట్టారు గదా, జీతం ఏ మాత్రం వృద్ధిచేశార్రా?

శేష—అదే సర్కారులో ఉండే అన్యాయం. జీతంమాత్రం అందరు గుమాస్తాలతో పాటే.

సోమప్ప—అంతేనా ?

శేష—అయితేమాత్రం, మున్సీ అంటే ఉన్న హోదా ఇతరగుమాస్తాల కేదీ? పైగా దినసంపాదన ఎంత ?

సోమప్ప—అంటే ?

శేష— కేసు దాఖలయిందంటే మనకి రూపాయి చదివించనిదే పార్టీలు కోర్టు విడిచి వెళ్లడానికి వీల్లేదు. ప్రతికేసులోనూ ఏదో పక్షం గెలుస్తూ ఉంటుంది. గెలిచినవాడు, తన సంతోషంకొద్దీ, తలా నాలుగూ, అయిదూ ఇచ్చిపోతూ ఉంటాడు. ఒకవేళ వాళ్లిద్దరూ రాజీపడిపోతారనుకో. అప్పుడు ఉభయులూ ఇచ్చి పోవలసిన దే. ఎందుకులే? దానిలో లక్ష సౌకర్యా లున్నవి.

తల్లి — అబ్బాయీ! ఎరక్క అడుగుతాను. ఈ పిచ్చిపీనుగు ఇట్లా అడిగిందనుకోకేం. మొన్న ఆ మధ్య మనింటికి ఎదుటింటి సుబ్బారావు ఇంగ్లీషుపేపరు చదువుతూ అదేదో ఇంగ్లీషువాళ్ల దేశంలో సర్కారు ఉద్యోగస్థులు లంచాలుతీసుకొంటే ఉరిశిక్ష వేయవలసినట్టు చట్టం చేశారని చదివేడురా ?

శేష—వాడి మొఖం! అసలు వాడికి ఇంగ్లీషుపేపరు చదవడం తెలుసా ?

తల్లి—ఏమో మరి ?

శేష—చదివితే వాడి కర్థం అయి ఏడిసిందా ? అర్థమయిందే అనుకో. పేపర్లో పడే సంగతులన్నీ నిజమే అనుకొంటున్నావా ?

తల్లి—అంతేనా ?

శేష—అయినా, మనం తీసుకొనేది లంచం కానేకాదు. ఇది అనాదిగా వచ్చే మామూళ్లు. అనగా మర్యాదలు. పూర్వం పెద్దలు ఎప్పుడు ఏర్పాటుచేశారో, తరతరాలుగా ఈ సంప్రదాయం మన దేశంలో వస్తూనేవుంది.

తల్లి — ఏమో నాయనా! ఇవ్వేళ చూచినవాళ్లు రేపటికి ఇట్టెట్టే ప్రయోజకులయి మాట్లాడ్డానికి శక్యం గాకుండా ఉన్నారు. మే మిద్దరం ముసలివాళ్లం అయిపోయినాంగదా? కష్టపడి చదువుకొన్నందుకు నువ్వు ప్రయోజకుడవైతే, చూస్తూ నీ చేతుల మీదుగా వెళ్లిపోవాలని మొక్కుకొంటున్నాం.—లే! లేచి స్నానంచెయ్యి. కచ్చేరీకి వేళ అయింది.

## 3

అబ్బాయిఉద్యోగవైభవం ఆ తల్లిదండ్రులకు తనివితీరడం లేదు. మేస్ట్రీటుగారితో సమానంగా జరగాలి అబ్బాయికి మర్యాదలూ, లాంఛనాలూను. మేస్ట్రీటు గారు కచ్చేరీకి పోతుంటే ముందొక డవాలీ

జవాను దారితీస్తూ ఉంటాడు—మున్సీ గారు కచ్చేరికి బయల్దేరితే, తండ్రే ముందు దారితీస్తూ "మున్సీగారు వస్తున్నారు. దారి తొలగం"డని వచ్చీపోయేవారిని హెచ్చరిస్తూ ఉంటాడు. మేస్ట్రీటుగారికి మధ్యాహ్నం 3 గంటలకు వంటబ్రాహ్మడు కాఫీఫలహారాలు తీసుకొనిపోతాడు—మున్సీ గారికి తండ్రే కాఫీఫలహారాలు కచ్చేరికి తీసుకొనిపోతాడు. మేస్ట్రీటుగారికి ఇంటిదగ్గర జవాన్లు విసనకర్రతో విసురుతూ ఉంటారు—మున్సీ గారికి సోమప్పే పక్కననిలబడి పంకా విసురుతుంటాడు.

ఏమి మహద్దశ! ఏరోజునా కచ్చేరి నుండి ఇంటికి వచ్చేవరకు, ఈ జేబులోనుండి రెండూ, ఆ జేబులోనుండి మూడూ మున్సీ గారు తీసి తండ్రిచేతిలో పెట్టని రోజు లేదు. అబ్బాయిజీవితాన్ని అదృష్టమేఘాలు ఆవరించి కనకవర్షం కురిపించివేస్తున్నవని అనుకొంటూ ఆ తెచ్చిన డబ్బు కళ్లనద్దుకొని పెట్టెలో వేసుకొంటూ ఉండేవాడు సోమప్ప.

౪

ఆరోజు మేస్ట్రీటుగారి కోర్టులో ఒక పెద్ద దోపిడీకేసు విచారణ వాయిదా. కచ్చేరీకి తొందరగా పోవాలి, వంట త్వరగా కానియ్యాం డన్నాడు శేషగిరి. తొమ్మిది గంటలకే వంట పూర్తి చేసింది తల్లి.

వీధిగుమ్మంలో నిలబడి "అబ్బాయీ! మంచినీళ్ల బిందె పట్టుకొని పచ్చని ముత్తైదువు ఎదురైంది. తొందరగా రా" అని పిలిచాడు తండ్రి.

తెల్లటి చలవధోవతీ, ట్విల్లుషర్టూ, మెడ నిండా మూసేసిన అయిదుగుండీల గోధుమ వన్నె టస్సూరా కోటూ, నెత్తిన ఆర్గండీ పాగా, మెడలో నూరోనెంబరు మామిడంచు బిళ్లమడతల ఉత్తరీయం, రెండు చేతులకూ పలకల మురుగులూ, చెవలకి ఎర్రరాళ్ల అంటుపోగులూ, ఎడమచేతి తర్జనీ కనిష్ఠికాలకు డైమను కళావరు మార్కు ఉంగరాలూ, మొఖాన తెల్లటి గంధం అక్షతలూ — ఆంధ్రత్వం ఉట్టిపడుతోంది – చూచేవాళ్లకు పాతకాలపు డిప్టీకలెక్టరులాగా ఉన్నాడు శేషగిరి.

"య శ్శివో నామరూపాభ్యాం యా దేవీ సర్వమంగళా" అంటూ దారి తీశాడు తండ్రి.

పదకొండూ కొట్టేవరకు గద్దె మెక్కారు మేస్ట్రీటుగారు కచ్చేరీలో. పోలీసులూ, కేసులో ముద్దాయీలూ, సాక్షులూ హాజరయ్యారు. ముద్దాయీలను పిలిచారు. వారువచ్చి న్యాయస్థానంలో చేతులుకట్టుకొని నిలబడ్డారు. సాక్షిని బోనెక్కించి "దేవుని ఎదుట ప్రమాణంచేసి అంతా నిజం చెప్తాను. అబద్ధం చెప్ప"నని ప్రమాణం చేయించారు. చోరీబంగారునగలసొత్తు ఉంచి తాళంవేసిన పెట్టె ఖజానాలోనుంచి తెప్పించి కోర్టులో హాజరుపెట్టారు జవాన్లు. మేస్ట్రీటుగారు బీగా లిచ్చి పెట్టె తెరవమన్నారు శేషగిరిని. "ఈముద్దాయీలు నీ బంగారుగొలుసూ, బంగారునగలూ దోపిడీచేశా రంటున్నావే. కనీసం ఆ బంగారుగొలుసు నీది అని చెప్పడానికి ఏదయినా గుర్తు చెప్పగలవా?" అని అడిగేరు మేస్ట్రీటుగారు సాక్షిని.

"చిత్తం! చెప్పగలనం"డన్నాడు సాక్షి.

మేస్ట్రీటుగారి డయస్‌దగ్గర నిలబడ్డ శేషగిరి సాక్షిముఖంలోకి వెర్రిగా చూచాడు.

"నీగొలుసుకి గుర్తేమిటో చెప్పు" అని అడిగారు మేస్ట్రీటుగారు.

"ఆగొలుసుబిళ్ల మీద నాపేరు అక్షరాలు సన్నంగా చెక్కి ఉన్నవండి." అన్నాడు సాక్షి.

ముస్లీని పెట్టె తెరచి గొలుసు బయటికి తీయమన్నారు మేస్త్రీటుగారు.

కాళ్లూ చేతులూ గడగడ వణకడం ఆరంభించినవి ముస్లీకి. పెట్టె తెరచి, "గొలుసు అగుపడ దేం సార్" అన్నాడు ముస్లీ.

"ఆ!........."అని దిగ్గున లేచారు మేస్ట్రీటుగారు.

పోలీసులూ, మేస్ట్రీటుగారూ పెట్టె అంతా పరీక్షించారు. గొలుసు లేదు.

"ఏమైంది" అని ముస్లీ నడిగారు మేస్ట్రీటుగారు.

"నాకు తెలియ"దన్నాడు ముస్లీ.

"ముందు ముస్లీని అరెస్టుచేయం" డన్నారు మేస్ట్రీటుగారు.

వెంటనే పోలీసు ఇన్స్పెక్టరును ముస్లీ యింటికి పంపి సోదావేయించారు. ఆడవాళ్ల మెడలో ఉన్న వస్తువులు తీయించి పరీక్షించారు. ముస్లీ భార్య మెడలో ఉండిన గొలుసు తీయించారు.

"ఇదే నాగొలుసు. ఇదిగో, నాపేరు —కటకం గోపన్న—చూడండి." అని సన్నటి అక్షరాలు చూపించాడు సాక్షి.

"చోరీసొత్తును దొంగిలించినందుకు వీళ్లు గూడ నేరస్థులే" అంటూ సోమప్పనీ, భార్యనీ, కోడల్నీ అరెస్టుచేసి తీసుకొనిపోయారు పోలీసులు.

"గొలుసుమీది 'కటకంగోపన్న'ని చూసిఉంటే ఈపని చేయకపోదునే—"

అని చాలా పశ్చాత్తాపపడ్డాడు ముస్లీ.

